# గొప్ప స్వాతంత్ర్యము
## (గలతీ పత్రిక సంగ్రహ సమీక్ష)

**A. ఉపోద్ఘాతం :** క్రొత్త నిబంధన కాల ప్రజలకు "సత్యసువార్తను నమ్మి పాతనిబంధన కాల ధర్మశాస్త్ర నియమాల నుండి విడుదల పొందండి" అని ప్రకటిస్తున్న సమయంలో ఆనాటి సంఘాల్లో అబద్ధ బోధకులు లేచి అర్థజ్ఞానంతో అసత్యాన్ని అంటుగట్ట జూచారు. వారిని ఖండిస్తూ, క్రీస్తులోని నిజస్వాతంత్ర్యాన్ని విశ్వాసులు అర్థవంతంగా అనుభవిస్తూ ఆశీర్వదించబడాలన్న పౌలు ప్రయాస ఫలితంగా వెలువడిన రచననే గలతీ పత్రిక. ప్రస్తుతం మన సంఘాలలోని బోధల విషయం జాగ్రత్త వహించాలన్నా ఈ చివరి దినాల్లో సత్యవార్తతో సత్యమార్గంలో నడుచుకుంటూ ఆయన రాకడకు సిద్ధంగా ఉండాలన్నా ఈ పత్రికను తప్పకుండా చదవాల్సిందే.

1. **గ్రంథకర్త :** అపొస్తలుడైన పౌలు (గల 1:1-2).

2. **వ్రాసిన కాలము :** క్రీస్తు శకం 48-58 సం॥ల మధ్యకాలంలో (బహుశా క్రీ.శ.57 సం॥లో) వ్రాయబడింది.

3. **ఉద్దేశం :** గలతీయ పట్టణంలో పౌలు పరిచర్య చాల విజయవంతంగా జరిగింది. గొప్ప జనసమూహాలు, అందులో ఎక్కువగా అన్యులు క్రీస్తును విశ్వసించారు. అయితే పౌలు ఆ సంఘాన్ని విడిచి వెళ్ళిన తరువాత యెరూషలేము నుండి వచ్చిన కొందరు యూదా మత ప్రవిష్ఠులు, రక్షణ పొందాలంటే పౌలు సువార్త ప్రకారం (1:7) యేసు క్రీస్తునందు విశ్వాసం ఉంచడం మాత్రమే సరిపోదు గాని మోషే ధర్మశాస్త్ర ప్రకారం సున్నతి కూడ పొందాలని, ఇతర సాంప్రదాయలను, దినాలను ఆచరించాలని బోధించనారంభించారు. అలా వారిని మరలా ధర్మశాస్త్రమనే కాడి క్రిందికి నడిపించారు. సున్నతిని గూర్చిన చర్చ ఓ మహమ్మారిలా వ్యాపించింది. వారు పౌలు బోధపై మాత్రమే కాదు, అతని అపొస్తలత్వంపై కూడా దాడి చేసారు. కనుక వారి బోధను ఖండిస్తూ ఈ పత్రిక వ్రాయబడింది.

4. **గ్రంథ విశిష్ఠత :** ఏ లేఖికుని సహాయం లేకుండా పౌలు స్వయంగా వ్రాసిజి పత్రిక బహుశా గలతీ పత్రిక ఒక్కటే కావొచ్చు. ఈ పత్రిక రోమా పత్రిక ముగింపు (తుది) అంశంతో (విశ్వాసము ద్వారా నీతిమంతులగుట) ఆరంభించబడి II కొరింథీ పత్రిక ఆరంభ అంశంతో (పౌలు అపొస్తలత్వపు నిరూపణ) ముగించబడింది.

ఈ పత్రిక కొరింథీయులకు వ్రాసిన పత్రికల వలె క్రైస్తవ సౌశీల్యాన్ని సరిదిద్దేదికాదు గాని గలతీయులకు హాని కలిగించేదానిని బాగుచేసేది. ఈ పత్రికలో అభినందనలు, స్తుతి, కృతజ్ఞత చెల్లించడం, ప్రార్థించమన్న మనవి, క్రీస్తులో ఆ సంఘస్తుల జీవిత విధాన వివరణ

మొదలైనవి లేవు. ఇతర పత్రికలలో వ్రాసినట్లు పౌలుతో పాటు మరెవరి పేర్లు ప్రస్తావించబడలేదు (1:2).

రోమా పత్రిక పౌలు మేధస్సు నుండి ఉద్భవిస్తే, గలతీ పత్రిక హృదయంలో నుండి ఉద్భవించింది. విశ్వాస జీవితానికి హాని కలిగించే స్వేచ్ఛావాదాన్ని పౌలు సహించలేక పోయాడు. రోమా పత్రికలో క్రమమైన రీతిగా చెప్పబడినదే ఈ పత్రికలో వివాదాస్పదంగా చెప్పబడింది.

గొప్ప మత సంస్కరణ కర్తయైన మార్టిన్ లూథర్‌కు అతి ప్రియమైన పత్రిక ఇది. అదే అతని సంస్కరణకు ఆధారం. ఈ గలతీ పత్రిక ఆదిమ సంఘ మూల చట్టముగా (మాగ్నకార్టగా) క్రైస్తవ స్వాతంత్ర్యపు ఆదర్శ ప్రచురణగా పిలువబడింది.

విశ్వాసం ద్వారా నీతిమంతులుగా తీర్చబడతారన్న సిద్ధాంతాన్ని లేఖనాలలో నుండి మరియు లేఖనాలకు వేరుగా సమర్థిస్తూ బలంగా చేయబడిన ప్రకటన ఈ పత్రిక. క్రైస్తవ విశ్వాసాన్ని ఎటువంటి దాడినుండైనా కాపాడగల శక్తివంతమైన సత్యం ఇది. కృప ద్వారా పాపి రక్షించబడడం మాత్రమే కాదు గాని రక్షించబడిన పాపి కూడ కృపద్వారానే జీవిస్తాడు. కృప జీవానికి మార్గం మరియు జీవ మార్గం.

5. **మూల పదము :** స్వాతంత్ర్యము. ఈ మాట గలతీ పత్రికలో 11 సార్లు ఉపయోగించబడింది.

## B. గ్రంథ విభజన :

### I. ఉపోద్ఘాతం. 1:1-10.

అ. అభివందనము (1:1-5).

ఆ. విషయ వివరణ (1:6-10).

### II. వ్యక్తిగతం - అపొస్తలుని అధికారం మరియు సువార్త మహిమ 1:11-2:14.

అ. అరేబియాలో పౌలు అనుభవం. (1:11-24).

ఆ. యెరూషలేములో అపొస్తలుతో పౌలు అనుభవం (2:1-10).

ఇ. అంతియొకయలో పేతురుతో పౌలు అనుభవం (2:11-14).

### III. సిద్ధాంతం - విశ్వాసం ద్వారా నీతిమంతులుగా తీర్చబడుట (2:15-4:31).
**(విశ్వాసం × క్రియలు; స్వాతంత్ర్యం × దాస్యం)**

అ. విశ్వాసం ద్వారా నీతిమంతులుగా తీర్చబడుట - సిద్ధాంత వివరణ (2:15-21).

ఆ. విశ్వాసం ద్వారా నీతిమంతులుగా తీర్చబడుట - గలతీయుల అనుభవం (3:1-5).

ఇ. విశ్వాసం ద్వారా నీతిమంతులుగా తీర్చబడుట - అబ్రాహాము దృష్టాంతం (3:6-4:18).

ఈ. విశ్వాసం ద్వారా నీతిమంతులుగా తీర్చబడుట - హాగరు మరియు శారయిసాదృశ్యం (4:19-31).

**IV. ఆచరణాత్మకం - ఆత్మద్వారా శుద్ధీకరణ. 5:1-6:10.**

**(ఆత్మ × శరీరం; స్వాతంత్ర్యం × దాస్యం)**

అ. విశ్వాసం ద్వారా రక్షించబడి, ధర్మశాస్త్రం ప్రకారం జీవించడం కృపనుండి తొలగిపోయే అపరాధానికి కారణమౌతుంది (5:1-15).

ఆ. విశ్వాసం ద్వారా రక్షించబడి ఆత్మలో నడవడం ఆత్మఫలాన్ని ఉత్పత్తి చేస్తుంది. (5:16-26).

ఇ. విశ్వాసం ద్వారా రక్షించబడి ఆత్మఫలాన్ని కలిగి ఉండడం క్రైస్తవ సౌశీల్యాన్ని ఆపాదిస్తుంది. (6:1-10).

**V. స్వహస్తాక్షరాలతో ముగింపు. 6:11-18.**

అ. పౌలు స్వంత దస్తూరీ (6:11).

ఆ. పౌలు స్వంత సాక్ష్యం (6:12-18).

1. క్రీస్తు సిలువ × సున్నతి 6:12-15.
2. పౌలు శరీరంపై క్రీస్తు (చేవ్రాత) దస్తూరీ (6:16-18). (నూతన సృష్టి యొక్క నూతన సున్నతి)

## C. అంశాల వారిగా సంక్షిప్త వివరణ :

### I. నిరూపణ (1-2 అధ్యా) :

**అ. గలతీయుల సమస్యను గూర్చి పౌలు విచారం (1:1-9) :** పౌలు వ్రాసిన ప్రతి పత్రికలోను మొదట శుభములు, కృతజ్ఞతాస్తుతులు కనిపిస్తాయి. కాని ఈ సంఘస్తుల ఆధ్యాత్మిక సమస్య తీవ్రతను బట్టి, పౌలు సువార్త యొక్క తీవ్రతనే ప్రస్తావించాడు. కారణం వారు వేరొక సువార్త వైపు అనగా పౌలు గాని మరెవరుగాని చివరికి దేవదూతలు చెప్పినా వినకూడని దుర్బోధవైపు వారు తిరిగిపోయారు (1:6). అలాంటి బోధ చేసేవారు శాపగ్రస్తులని రెండు పర్యాయాలు వ్రాసాడు (1:8,9). పౌలు చెప్పిన సువార్త తప్ప మరేసువార్త కూడ అంగీకరించకూడదని స్పష్టం చేసాడు. ఇంతకూ పౌలు ప్రకటించిన సువార్త ఏంటి? పౌలు సువార్త మనిషి క్రియలను సమాప్తిచేస్తుంది. "మనుష్యుడు యేసుక్రీస్తు నందలి విశ్వాసము వలననేగాని ధర్మశాస్త్ర సంబంధమైన క్రియల మూలమున నీతిమంతుడుగా తీర్చబడడు" (2:16). మానవుని పాప విమోచనము, దాని కొరకైన క్రయధనము యొక్క అవసరతను గూర్చి చెప్తూ, క్రీస్తు మనలను విమోచించేందుకు తన్నుతాను అప్పగించుకున్నాడని (1:4) ఇక మానవుడు మరేమి చేయనక్కరలేదని పరోక్షంగా జ్ఞాపకం చేసాడు.

**ఆ. పౌలు అపోస్తలత్వాన్ని నిరూపించుకొనుట (1:11-2:21) :** పౌలు బోధ దేవునివలన అధికారాన్ని పొందినది (1:11-24). మన అనుభవం ద్వారా అనేక విషయాలను మనం

నేర్చుకోవచ్చును, కాని దైవిక విషయాలు దేవుని ద్వారానే మనకు ప్రత్యక్షపరచబడాలి (1:12). ప్రభువు రాత్రి భోజన సంస్కారం (I కొరి 11-23). క్రీస్తు మరణ పునరుత్థానాలను గూర్చిన ప్రత్యక్షతను పౌలు దేవుని నుండే పొందాడు (I కొరి 15 అధ్యా). తన పరిచర్యను గూర్చి కూడ కేవలం దేవునినే సంప్రదించాడు ఆయన నుండే అధికారాన్ని పొందాడు. పౌలు సువార్త వెనుక గల ఈ అధికారం పేతురులాంటి అపొస్తలులను కూడ ఖండిచగలదని తెలుస్తున్నది (2:11-21).

ఇ. **పౌలు రక్షణ గూర్చి, అపొస్తలిక పిలుపును గూర్చిన ఆవశ్యకత మరియు ఉద్దేశం (1:13-16) :** ఈ భాగంలో పౌలు అతని మార్పుకు ముందున్న భయంకరమైన జీవితాన్ని గూర్చి చెప్తూ, క్రైస్తవ పరిచర్య కొరకైన తన పిలుపు అతని జన్మకు ముందే ఆరంభమైందని చెప్పాడు (1:15). అతని పిలుపు ప్రధానోద్దేశం 1:16 లో స్పష్టమౌతున్నది. పౌలు ద్వారా క్రీస్తు ప్రత్యక్షపరచబడేందుకే దేవుడు క్రీస్తును అతనికి ప్రత్యక్షపర్చాడు.

ఈ. **పౌలు రక్షణ పిలుపు అనంతరం జరిగిన సంఘటనలు (1:17-2:21) :** పౌలు దమస్కు మార్గంలో రక్షించబడ్డాక దాదాపు 3 సంవత్సరాలు అరేబియాలో గడిపాడు. తిరిగి దమస్కుకు వచ్చాడు. (1:17; అపొ 9:23-25, II కొరి 11:30). తరువాత యెరూషలేముకు వెళ్ళాడు (1:18-20; అపొ 9:26-29) రక్షణ పొందాక యెరూషలేముకు వెళ్ళడం ఇదే మొదటిసారి. అక్కడ 15 రోజులు మాత్రమే ఉన్నాడు. పేతురును, యేసు సహోదరుడైన యాకోబును కలిసాడు. అక్కడి నుండి సిరియాకు, కిలికియాకు వెళ్ళాడు. (అపొ 9:30; గల 1:21; అపొ 22:17-21). అంతియొకయలో బర్నబాతో కలిసి సేవచేసాడు. (అపొ 11:25,26). బర్నబాతో కలిసి తిరిగి యెరూషలేముకు వచ్చాడు. (గల 2:1-10; అపొ 11:29,30). అప్పటికే అతడు రక్షించబడి 14 సంవత్సరాలైంది. ఆ సమయంలో యూదులు, దేవుని కృపను ప్రకటిస్తున్న పౌలుపై ఒత్తిడి తీసికొని వచ్చారు. పేతురు, యోహాను, యాకోబులు అన్యజనులకు సువార్త ప్రకటించేందుకు పౌలును ప్రోత్సహించారు. అతడు బర్నబా మరియు యోహాను అనే మారు పేరుగల మార్కుతోపాటు అంతియొకయకు తిరిగి వచ్చాడు (అపొ 12:25) అలా అతని సువార్త పరిచర్య ఆరంభమైంది.

ఉ. **అంతియొకయలో పేతురును ఖండించిన ఉదాంతం (2:11-14) :** ఈ సంఘటన ఎప్పుడు జరిగిందో తెలియదు. యోరూషలేము మహాసభ అనంతరం జరిగి ఉండవచ్చునన్న అభిప్రాయం ఉంది. ఏది ఏమైనా పేతురు యూదుల వత్తిడికి లోనై అన్యులకు వేరయ్యాడని స్పష్టమౌతున్నది. అలా చెయ్యడం వలన పేతురు సంఘ ఐక్యతను (2:14) విశ్వాసము ద్వారా నీతిమంతులౌతామన్న సత్యాన్ని (2:15,16). విశ్వాసికి ధర్మశాస్త్రము నుండి కలిగిన స్వేచ్ఛను (2:17,18) విశ్వాసితో నివసించే క్రీస్తు చాలినవాడు అనే సత్యాన్ని (2:19,20) మరియు దేవుని కృపను (2:21) విస్మరిస్తున్నాడని పౌలు వివరించాడు.

పేతురు వెంటనే ప్రతికూలంగా ప్రతిస్పందించినట్లుగాని, పౌలును గూర్చి చెడుగా భావించడంగాని చెయ్యలేదు. వారి సంబంధబాంధవ్యాలలో అంతరాయం కలుగలేదు (II పేతు 3:15). ఇక రెండవ అధ్యాయం ఇరవయవ వచనంలో ఓ గొప్ప సూక్తిని వ్రాసాడు. అది బైబిలంతటిలో కూడ అతి ప్రాముఖ్యమైన వచనం. "నేను క్రీస్తుతో కూడ సిలువ వేయబడియున్నాను, ఇకను జీవించువాడను నేను కాను, క్రీస్తే నాయందు జీవించుచున్నాడు."

## II. ఆక్షేపణ (3-4 అధ్యా) :

### 1. మోషే ధర్మ శాస్త్రము :

ఈ భాగంలో పౌలు క్రియలు అనే దాసత్వాన్ని గూర్చి గలతీయులను హెచ్చరించాడు. స్వేచ్ఛావాదానికి మరియు స్వేచ్ఛకు మధ్యగల భేదాన్ని తెలియజేస్తూ మూడు బలమైన దృష్టాంతాలను వారి ముందుంచాడు.

**అ. వ్యక్తిగత (స్వయం) దృష్టాంతం :** గలతీయుల మధ్య తన జీవితాన్ని దృష్టాంతంగా ఉంచిన పౌలు వారు సిలువ వేయబడిన క్రీస్తును కన్నులారా చూచినట్లుగా వారి ముందు ప్రదర్శించాడు. ధర్మ శాస్త్రం చెయ్యలేని దానిని కృప చేసిందని చూపించాడు. వారి ముందు రెండు ప్రశ్నలనుంచాడు. మీరు నూతన స్వభావాన్ని ఎలా పొందగలిగారు? ధర్మశాస్త్ర సంబంధమైన క్రియల వలన ఆత్మను పొందారా? లేక విశ్వాసముతో వినడం వలననా? ఆత్మానుసారంగా ఆరంభించి, శరీరానుసారంగా ముగిస్తారా? (3:2, 3) ఈ ప్రశ్నలలోనే వారి తప్పిపోయిన స్థితి అర్థమౌతుంది.

**ఆ. ధర్మశాస్త్రమును గూర్చిన దృష్టాంతం (3:6-4; 20) :**

1. అబ్రాహాము మరియు ధర్మశాస్త్రము : ధర్మశాస్త్రము రాకమునుపే చాలాకాలం క్రితం అబ్రాహాము దేవుని యందలి విశ్వాసం మూలంగా నీతిని పొందాడు (3:6,7).
2. అన్యులు కూడ విశ్వాసం ద్వారానే నీతిమంతులుగా తీర్చబడతారని దేవుడు అబ్రాహాముతో చెప్పాడు (3:8,9; ఆది 12:3).
3. దేవుడు విశ్వసించిన పాపులను క్షమించడం మాత్రమే కాదు, విశ్వాస మూలంగానే వారిని కాపాడుతాడు. నీతిమంతుడు విశ్వాస మూలముగా జీవించును (3:11) అనే ఈ వాక్యము పాత నిబంధనలో హబక్కూకు 2:4 నుండి తీసికొనబడింది. క్రొత్త నిబంధనలో రోమా 1:17; హెబ్రీ 10:38 లో కూడ ఉపయోగించబడింది.

**2. పాపులు మరియు ధర్మశాస్త్రము (3:10; ద్వితీ 27:26) :** యాకోబు పత్రిక 2:10 లో ఒక వ్యక్తి ధర్మశాస్త్రములోని ఒక్క ఆజ్ఞను గైకొనకున్నా ఆజ్ఞలన్నిటి విషయంలో అపరాధి అవుతాడని వ్రాయబడింది. ధర్మశాస్త్రం ఓ పెద్ద గొలుసులాంటిది. దానిలోని ఒక్క కొంకి తెగిపోయినా

గొలుసంతా తెగిపోతుంది. ధర్మశాస్త్రము నీతిని కలుగజేయకపోగా దానిని అతిక్రమించేవారికి మరణాన్నిస్తుంది (3:10) అది సంపూర్ణ విధేయతను కోరుతుంది. ధర్మశాస్త్రాన్ని అనుసరిస్తే ఏదో దొరుకుతుందని తలంచకూడదు. దాన్ని అనుసరించనంత వరకు మనిషి బాగుంటాడు. అతిక్రమిస్తే ఆ ధర్మశాస్త్రమే శిక్ష విధిస్తుంది. ఈ లోక సంబంధమైన చట్టాలన్నీ అలాగే ఉంటాయి.

**3. ఇశ్రాయేలు మరియు ధర్మశాస్త్రము :**

ఎ) అబ్రాహాముకు విశ్వాసం ద్వారా నీతికలుగుతుందన్న వాగ్ధానం ఇవ్వబడిన 430 సంవత్సరాలకు ధర్మశాస్త్రం ఇవ్వబడిందని పౌలు వ్రాసాడు (3:16). ఈ వచనం బైబిలు విద్యార్థులను మీమాంసలో ఉంచుతుంది. ఎందుచేతనంటే అబ్రహాము పిలుపుకు ఇస్సాకు జన్మకు మధ్య కాలము 25 సం॥ యాకోబు పుట్టినపుడు ఇస్సాకు వయస్సు 60 సం॥లు యాకోబు ఐగుప్తుకు వెళ్లినప్పుడు వయస్సు 130 సం॥లు ఇశ్రాయేలీయులు ఐగుప్తులో ఉన్న 430 సం॥లు కలిపితే (నిర్గ 12:40) వారికి ధర్మశాస్త్రం ఇవ్వబడేసరికి మొత్తం 645 సం॥లు అవుతుంది. ఆది 15:13; అపొ 7:6 లో వారు ఐగుప్తులో ఉన్నకాలము 400 సం॥లు అని సంపూర్ణ సంఖ్యగా వ్రాయబడింది. ఏది ఏమైనా బహుశా పౌలు, దేవుడు యాకోబుతో వాగ్ధానాన్ని పునరావృతం చేసినప్పటి నుండి (ఆది 46:1-4). ధర్మశాస్త్రం ఇవ్వబడేంత వరకు గల కాలాన్ని అనగా 430 సం॥లు మాత్రమే పేర్కొన్నాడని అర్థమౌతుంది.

బి) ధర్మశాస్త్రం మానవుని పాపాన్ని బట్టి ఇవ్వబడింది (3:9).

సి) ధర్మశాస్త్రం ఇశ్రాయేలుకు ఇవ్వబడడంలో దేవదూతల ప్రమేయం కూడ ఉంది (3:19). దేవుడు వేవేల పరిశుద్ధ సమూహములతో సీనాయి పర్వతంపైకి దిగివచ్చాడు. (ద్వితీ 33:2; కీర్త 68:17). ధర్మశాస్త్రం దేవదూతలచే నియమించబడింది (అపొ 7:53) వారి ద్వారా పలుకబడింది (హెబ్రీ 2:2).

డి) ధర్మశాస్త్రము ఇశ్రాయేలుకు బాలశిక్షకునిగా ఉండినది (3:24) : ఇక్కడ వ్రాయబడిన బాలశిక్షకుడు అనే మాటకు ప్రస్తుతకాల ఉపాధ్యాయుడు అనే మాటకు ఏ సంబంధం లేదు. రోమీయుల కుటుంబాలలో క్రొత్తగా పుట్టిన శిశువును పెంచేందుకు నియమించబడిన బానిస లేక పనివానికి ఈ మాట ఉపయోగించబడింది. అతడు ఆ శిశువుకు స్నానం చేయిస్తాడు. దుస్తులు వేసి పొత్తిగుడ్డలతో చుడతాడు, ముక్కు తుడుస్తాడు, పాలు పట్టిస్తాడు. ఆ శిశువు పాఠశాలకు వెళ్ళే వయస్సు వచ్చినప్పుడు అతడు ఆ బాలుని చెయ్యిపట్టుకొని పాఠశాల వరకు నడిపిస్తాడు. ఆలాగే ధర్మశాస్త్రం మనిషిని చేయిపట్టుకొని క్రీస్తు సిలువ చెంతకు నడిపించి, నీకు రక్షకుడు అవసరం అని చెప్తుంది. ఆయనను విశ్వసించినవారు ఆయన కాడి క్రిందికి వస్తారు గాని ధర్మశాస్త్రం కాడి క్రిందికి కాదు.

**4. క్రీస్తు మరియు ధర్మశాస్త్రం :**

ఎ) ఆయన మనల్ని ధర్మశాస్త్రం యొక్క శాపము నుండి విడిపించాడు (3:13; ద్వితీ 21:23)

బి) దీనినంతా క్రీస్తు దేవుడు నిర్ణయించిన సమయంలో తన శరీరం ద్వారా నెరవేర్చాడు (4:4,5).

సి) మారుమనస్సు పొందిన పాపులందరినీ ఆత్మ బాప్తీస్మం ద్వారా తన శరీరంలో చేర్చి ఐక్యపర్చాడు. (3:26-29).

రోమా ప్రపంచంలో మూడు గొప్ప విభాగాలున్నాయి.

1. జాతిమత భేదాలు - యూదులు మరియు గ్రీకులు.
2. సాంఘీక, వర్గ భేదాలు - దాసులు మరియు స్వతంత్రులు.
3. పురుషులు మరియు స్త్రీలు.
   అయితే క్రీస్తులో ఈ బేదాలేమిలేవు. క్రీస్తు సిలువ అందరినీ ఏకంచేసింది.

డి) అలా చెయ్యడం ద్వారా మనల్ని దేవుని కుమారులుగా దత్తత చేసికొన్నాడన్న సంపూర్ణ నిశ్చయతను మనకిచ్చాడు (4:1-7). బాల్యం అన్నది దేవుని కుటుంబంలో మన స్థితిని తెలుపుతుంది. దత్త పుత్రత్వము మనస్థానాన్ని తెలుపుతుంది. నూతన జన్మద్వారా కుటుంబంలో ప్రవేశిస్తాము, దత్త పుత్రత్వం ద్వారా కుటుంబ సంతోషాన్ని అనుభవిస్తాము. బాలుడు సంరక్షకుల ఆధీనంలో ఉంటాడు కాని పెద్దవాడైన దత్తపుత్రుడు స్వతంత్రుడు.

ఇ) ఈ సత్యాన్నే పౌలు కుమారునికి మరియు దాసునికి మధ్యగల వ్యత్యాసాన్ని దృష్టాంతంగా తీసికొని వివరించాడు (4:7). దాసుడు తన పాత స్వభావాన్ని తనలోనే నిలుపుకొని ఉంటాడు. కాని కుమారుడు తన తండ్రికి కలిగిన వాటితో సంతోషిస్తాడు. దాసుడు యజమానిని కలిగి ఉంటాడు కుమారుడైతే తండ్రిని కలిగి ఉంటాడు. దాసుడు చట్టం మరియు భయమును బట్టి లోబడతాడు కాని కుమారుడు స్వేచ్ఛ ప్రేమలను బట్టి లోబడతాడు దాసునికి స్వాస్థము ఇవ్వబడదు కాని కుమారుడైతే తండ్రి స్వాస్థ్యానికి చట్టపరమైన వారసుడు.

**5. దేవుని వాగ్దానం మరియు ధర్మశాస్త్రము :**

ఎ) ధర్మశాస్త్రము దేవుని వాగ్దానాన్ని మార్చలేదు (3:15-18).

బి) అది వాగ్దానం కంటె గొప్పదికాదు (3:19,20).

సి) అది వాగ్దానానికి విరోధమైనదికాదు (3:12-26).

డి) వాగ్దానము నెరవేర్చిన కార్యాన్ని ధర్మశాస్త్రం నెరవేర్చలేదు (3:27-29).

**6. గలతీయులు మరియు ధర్మశాస్త్రము (4:8-20) :** పౌలు తన పాఠకులను ఉద్దేశించి ఈ మాటలు వ్రాసాడు.

ఎ) దేవుని ఎరిగినవారు దేవునిచే ఎరుగబడినవారు బలహీనమైన, నిష్ప్రయోజనమైన మూల పాఠాల తట్టు మరల తిరుగవచ్చా? మునుపటిలా తిరిగి దాసులై ఉండవచ్చా?

బి) పౌలుకు గలతీయులకు మధ్యగల అభిమానం ఏమైంది? (4:11-15).

సి) వారు ఆధ్యాత్మికంగా తమకు తల్లిలా ఉన్న పౌలు నుండి స్వేచ్ఛావాదుల దుర్బోధలవైపు తిరగడానికి కారణం ఏంటి? (4:16-20).

డి) 4:21-31 లో హాగరు మరియు శారాలను ఉదాహరణగా తీసికొని ఉపమానముగా వర్ణించాడు.

అబ్రాహాముకు దాసియైన హాగరు ద్వారా స్వాభావికంగా పుట్టిన ఇష్మాయేలు అనే కుమారుడున్నాడు. అసాధారణంగా శారాకు పుట్టిన ఇస్సాకు అనే కుమారుడు ఉన్నాడు. హాగరు ధర్మశాస్త్రానికి, శారా కృపకు సాదృశ్యంగా ఉన్నారు. శరీరానికి, ఇంకా ధర్మశాస్త్రానికి లోనైన వారికి ఇష్మాయేలు సూచనగా ఉన్నాడు. వారు దాసులైన పిల్లలు. ఇస్సాకు ఆత్మకు, యేసువైపు చూస్తున్న వారికి సూచనగా ఉన్నాడు. వారు స్వతంత్రులైన కుమారులు. హాగరు సీనాయి పర్వతానికి స్వేచ్ఛావాదానికి ప్రధాన కార్యాలయమైన భూసంబంధమైన యెరూషలేముకు సూచనగా ఉంది, శారా స్వాతంత్ర్యానికి ప్రధాన కార్యాలయమైన పరలోకంలోని యెరూషలేముకు సూచనగా ఉంది. విశ్వాసి ధర్మశాస్త్రాన్ని విడచిపెట్టాలి. ఇస్సాకు ఇష్మాయేలు ద్వారా శ్రమను, అవమానాన్ని పొందినట్లు మనకివ్వబడిన కృప శ్రమల కొరకేనని జ్ఞాపకముంచుకోవాలి.

**III. ప్రోత్సాహం (5, 6 అధ్యా) :** పౌలు క్రీస్తులో ఉన్న స్వేచ్ఛను గూర్చి మెచ్చుకుంటూ, వారికి వివరిస్తున్నాడు. గలతీయులు సువార్తను తమకు అన్వయింపజేసికోవాలన్న ఆశను పౌలు ఈ భాగంలో వ్యక్తం చేస్తున్నాడు. సువార్తను గూర్చిన మొదటి అన్వయము ధర్మశాస్త్రము నుండి వ్యక్తిగతంగా పొందిన స్వాతంత్ర్యానికే సంబంధించినది. అది నిజ స్వాతంత్ర్యాన్నిచ్చే దేవుని కృపాసువార్త (5:1-12). కాబట్టి గలతీయులు అందులో స్థిరముగా నిలిచి, మరల దాస్యమనే కాడి క్రింద చిక్కుకొన వద్దని పౌలు హెచ్చరిస్తున్నాడు. స్థిరముగా నిలిచి యుండుడి అనే మాట పౌలుకు చాల ఇష్టమైనది. అతడు తన పత్రికలలో తరచుగా దానిని ఉపయోగించాడు. విశ్వాసములో (I కొరి 16:13) స్వాతంత్ర్యములో (గల 5:1) ఏకాత్మకలిగి యుండుటలో (ఫిలి 1:27) మరియు ప్రభువులో (ఫిలి 4:1) స్థిరముగా ఉండాలని విశ్వాసులకు హెచ్చరించాడు.

**అ. క్రీస్తులోని స్వాతంత్ర్యము మరియు యూదుల స్వేచ్ఛావాదం (5:1-12). క్రీస్తులోని ఈ మహిమాన్విత స్వాతంత్ర్యాన్ని నిరాకరించడం అంటే ఏమిటి?**

1. క్రీస్తు ఆశీర్వాదకాడి నుండి ధర్మశాస్త్రపు భారమైన కాడికిందికి వెళ్ళుట (5:1). ఈ రెండు కాడుల మధ్య వ్యత్యాసాన్ని గమనించండి.

   ఎ) క్రీస్తు కాడి (మత్త 11:28-30).

బి) ధర్మశాస్త్రపు కాడి (అపొ. 15:10).

2. క్రీస్తులోని స్వాతంత్ర్యాన్ని నిరాకరించడం అంటే క్రీస్తులోని స్వాతంత్ర్యాన్ని నిరాకరించడం అంటే మోషే ధర్మశాస్త్రమంతటికి ఋణగ్రస్తులై యుండుట (3:3; ద్వితీ 27:26). కాని అలా ఎవరూ ధర్మశాస్త్రమునంతా పాటించలేరు.
3. కృప నుండి తొలగి పోవుట (5:4). అంటే తమ రక్షణను కోల్పోతారని అర్థం కాదు. క్రీస్తులోని స్వాతంత్ర్యాన్ని నిరాకరించిన వారు అదుపులేని ఓడలా ఉంటారని అర్థం. అందుకు ఉపయోగించబడిన గ్రీకు పదమే అపొస్తలుల కార్యములు 27:17, 26, 29, 32 లో వ్రాయబడింది. వారు సహోదరులు, దేవుని పిల్లలు, వాగ్దాన వారసులుగా ఉంటారు గాని కొట్టుకొని పోతున్న ఓడలా ఉంటారు.
4. క్రీస్తులోని స్వాతంత్ర్యాన్ని నిరాకరించేవారు క్రైస్తవ పందెంలో దిశను తప్పినవారు (5:7; హెబ్రీ 12:1,2). దేవుని కృపా పరిధిలో ఉన్న విశ్వాసి స్వతంత్రుడు, ఐశ్వర్యవంతుడు. బహుమానాన్ని, నెరవేర్పును సాధించేందుకు తన పరిధిలో పరుగెత్తే క్రీడాకారునిలా ఉంటాడు. కృపనుండి తొలగి పోయి ధర్మశాస్త్రానికి దాసుడైన తన పరిధి నుండి తప్పిపోయి ఓటమికి గురౌతాడు. అతడు విజయాన్ని సాధించాలంటే తనలో ఉన్న పులిపిండిని తీసిపారవేయాలి (5:9).

**ఆ. స్వాతంత్ర్యము మరియు స్వేచ్ఛాపరులకివ్వబడిన ఉత్తరువులు (5:13) :** ఈ వచనంలో స్వేచ్ఛావాదాంలోని విరుద్ధమైన దానిని హెచ్చరిస్తున్నాడు. క్రైస్తవులకు క్రీస్తు ద్వారా ఇవ్వబడిన స్వాతంత్ర్యము శరీరమును ఆస్పదము చేసికొనేందుకుకాదు. వాస్తవంగా కృపాసువార్త నిర్లక్ష్యంగా ఉండకుండ మనల్ని కాపాడుతుంది. చాల మంది ధర్మశాస్త్రానికి లోబడేందుకు భయపడరు గాని ఈ కృపకు లోబడి జీవించేందుకు భయపడతారు. ఎందుచేతనంటే ఈ కృప వారిని తమ ఇష్టానుసారంగా జీవింప జేస్తుందేమోనన్న భయం వారిలో ఉంటుంది. కృప విశ్వాసిని తన స్వేచ్ఛకు వదిలేయదు గాని, ఎప్పుడూ దేవుణ్ణి సంతోషపరిచే జీవితాన్ని కలిగి ఉండేలాగ, క్రీస్తుకు ఇష్టమైన వాటినే ఇష్టపడేలా చేస్తుంది. గలతీ పత్రిక క్రైస్తవ స్వాతంత్ర్యాన్ని గూర్చిన ప్రకటన. కట్టు దిట్టాలు, నియమ నిబంధనలు స్వాతంత్ర్యాన్ని పాడు చేస్తాయని కొందరు తలుస్తారు. కాని అది నిజం కాదు. నియమాలు ఆ స్వేచ్ఛను కాపాడుతాయి. ఏ నియమం లేని స్వాతంత్ర్యం మూర్ఖత్వం అవుతుంది. అనాగరిక సమాజాన్ని సృష్టిస్తుంది. స్వాతంత్ర్యం అంటే చట్టంలో స్వేచ్ఛ. పౌలు క్రీస్తులో మనకున్న స్వాతంత్ర్యాన్ని గూర్చి చెప్తున్నాడు. ప్రభువు ఆత్మ ఎక్కడ ఉందో అక్కడ స్వాతంత్ర్యం ఉంది. అదే క్రైస్తవ స్వాతంత్ర్యంలోని గొప్ప రహస్యం.

**ఇ. స్వాతంత్ర్యము మరియు శరీర కార్యాలు (5:15-21) :** గలతీ 5వ అధ్యాయంలో వలె రోమా పత్రిక 7వ అధ్యాయంలో కూడ పౌలు దేవుని అజ్ఞలను, శరీరము యొక్క చెడుతో

జతచేసి చెప్పాడు (రోమా 7:70–10 చదవండి). ఇప్పుడు గలతీపత్రిక 5వ అధ్యాయంలో ధర్మశాస్త్ర దుర్వినియోగ ఫలితంగా కలిగే 17 శరీర కార్యాలను వివరించాడు.

**ఈ. స్వాతంత్ర్యము మరియు ఆత్మఫలము (5:22,23) :** ఈ భాగంలో క్రియలు మరియు ఫలముకు గల తేడా ముఖ్యమైనది. కర్మాగారంలోని యంత్రం పని చేస్తుంది, ఏదో ఒక వస్తువును ఉత్పత్తి చేస్తుంది. కాని అది ఫలాలను ఉత్పత్తి చెయ్యలేదు. ఫలము జీవములో నుండి వస్తుంది. అలాగే విశ్వాసిలో అది ఆత్మద్వారా కలిగే జీవము. క్రియల విషయానికొస్తే మనం చాల కష్టపడాలి, శ్రమ పడాలి, కృషిచెయ్యాలి అని ఆలోచిస్తాం. కాని ఫలాన్ని గూర్చి ఆలోచించినప్పుడు దాని అందాన్ని గూర్చి అందులోని సారాన్ని గూర్చి ఆలోచిస్తాం. శరీరం నిర్జీవ క్రియలను ఉత్పత్తి చేస్తుంది. (హెబ్రీ 9:14) కాని ఆత్మ జీవించే ఫలాన్ని ఉత్పత్తి చేస్తుంది. క్రొత్తనిబంధనలో పలురకాల ఫలాలను గూర్చి వ్రాయబడింది. అవి క్రీస్తు కొరకు సంపాదించిన ప్రజలు (రోమా 1:13) పరిశుద్ధ జీవితం (రోమా 6:22) దేవునికిచ్చే కానుకలు (రోమా 15:16–18) సత్క్రియలు (కొల1:10) స్తుతి (హెబ్రీ 13:5) మొదలైన ఫలాలు. అయితే గలతీ 5:22,23 లో వ్రాయబడిన ఆత్మఫలం, క్రైస్తవ సౌశీల్యానికి సంబంధించినది.

**ఉ. స్వాతంత్ర్యము మరియు విశ్వాసి బాధ్యత :**

1. **ప్రేమసహిత జీవితం (5:14,15) :** విశ్వాసి తన వలె తన పొరుగువారిని ప్రేమించాలి. పడిపోయినవారిని జాగ్రత్తగా, ప్రార్థనాపూర్వకంగా మంచిదారికి తీసికొని రావాలి (6:1) ఇతరుల భారాన్ని భరించాలి (6:2) స్వేచ్ఛావాదులు ఇందుకు భిన్నంగా ఇతరులపై మోయలేని భారాన్ని మోపుతారు. (మత్త 23:4; అపొ 15:10). అందరికీ మేలు చెయ్యాలి. విశ్వాసి మేలు చేయడంలో (విసిగిపోడు) అలసిపోడు (6:9,10).
2. **ఆత్మానుసారమైన జీవితం (5:16–23) :** ఈ భాగంలో శరీరం ఎలా పనిచేస్తుందో గమనించవచ్చు. ఇక్కడ పేర్కొనబడిన 17 పాపాలు శరీరానికి సంబంధించినవి. సహజసిద్ధంగా మనం ఈలాంటి స్వభావాన్నే కలిగి ఉన్నాం. ఈ పనులనే చేస్తున్నాం. వీటి నుండి స్వతంత్రులవడానికే క్రీస్తు మనకు పరిశుద్ధాత్మను అనుగ్రహించాడు. కాబట్టి మనము ఆత్మానుసారంగా నడుచుకొంటే శరీరేచ్ఛను నెరవేర్చము (5:16). మన జీవితాన్ని పరిశుద్ధాత్ముడే ఏలేందుకు అనుమతించాలి.

చిన్నపిల్లల్ని చెయ్యి పట్టుకొని నడిపిస్తే నడక నేర్చుకొంటారు. అలాగే పరిశుద్ధాత్మ మనల్ని నడిపిస్తే మనం ఆధ్యాత్మిక నడకను నేర్చుకొంటాము. పరిశుద్ధాత్మ, ఆధ్యాత్మికంగా శిశువులుగా ఉన్నవారికి బాహ్యంగా చేయూతనివ్వడమే కాకుండ అంతర్గతంగా కూడ సహాయం చేస్తాడు. పరిశుద్ధాత్మతో చెయ్యి కలిపినడిస్తే మనం తొందరపడి ముందుకు పరుగెత్తము లేక జాప్యం చేస్తూ వెనుకబడము. ఆయనతో పాటు కలిసి అడుగులేస్తాము.

3. **ఆత్మఫలం (5:22) :** ఆత్మఫలంలోని తొమ్మిది కృపలలో ప్రేమ, సంతోషము, సమాధానము దేవునికి సంబంధించినవి; దీర్ఘశాంతము, దయాళుత్వము, మంచితనము ఇతరులకు సంబంధించినవి, విశ్వాసము, సాత్వికము, ఆశానిగ్రహము మనకు సంబంధించినవి.

4. **విత్తుట కోయుట (6:7-10) :** మనకు ఎంత తెలుసు అనే దానిపైగాక మనం ఎంత విత్తుతామో దానిని బట్టి మన పంట ఆధారపడి ఉంటుంది. మన గాదెలో విత్తనాలు సమృద్ధిగా ఉండవచ్చును, గాని వాటిని సరైన నేలలో విత్తకుంటే ఫలించవు. మన ఆలోచనలనే విత్తనాలను మన మాటల్లో, క్రియల్లో విత్తాలి. దేవుని వాక్యం ఎప్పుడూ దాని స్వభావంగల పంటనే ఇస్తుంది. మీ జీవితమనే విత్తనాన్ని శరీరమనే నేలలో కాక, ఆత్మ అనే నేలలో విత్తండి. ఆత్మలో పడిన విత్తనం దేవుణ్ణి మహిమపరుస్తుంది, కాని అది శరీరంలో పడితే కుళ్ళిపోతుంది ఆత్మకేవలం మంచి ఫలాన్నిస్తుంది. శరీరం కేవలం చెడ్డ ఫలాన్నిస్తుంది.

**ఊ. స్వాతంత్ర్యము మరియు పౌలు ముద్రలు (6:11-18) :**

"నేను యేసు యొక్క ముద్రలు నా శరీరమందు ధరించియున్నాను. ఇకమీదట ఎవడును నన్ను శ్రమపెట్టవద్దు" (6:17). ఈ పత్రిక గ్రామీణ ప్రాంతాల్లో చెదరిపోయి ఉన్న విశ్వాసుల గుంపులకు వ్రాయబడింది. వారిలో అనేకులు ఏదో ఒక విధమైన వ్యవసాయ సంబంధమైన పనులు చేసేవారు. కాబట్టి పౌలు గలతీయుల మనస్తత్వాన్ని మరియు పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని వారికి పరిచయమైన సాదృశ్యాలతో వారి పరిభాషలో ఈ మాటలను వ్రాసాడు. ముఖ్యంగా ఫలాలు ఫలించుట (5:22) భారాన్ని భరించుట (6:2) విత్తుట కోయుట (6:9) మరియు ముద్రలు (6:17) అనే సుపరిచితమైన అంశాలను నాలుగింటిని వారికి జ్ఞాపకం చేస్తున్నాడు.

చాలా మంది వ్యవసాయ కూలీలు బానిసలుగా అమ్మబడేవారు. వారు ఎవరికి చెందినవారో వారికి సంబంధించిన ముద్రలు వారి శరీరంపై ఉండేవి. కాబట్టి ఆత్మలో ఉన్న స్వాతంత్ర్యాన్ని గూర్చి, వివరించేందుకు పౌలు ఎలా ఉపయోగించాడో చూడండి. సాధారణంగా ఐదు రకాల మనుష్యులకు ముద్రలు వేయబడేవి.

1. **బానిసలు (దాసులు) :** వీరిపై ముద్రలు వారి యజమానులకు గుర్తుగా వేయబడేవి. ఈ యాజమాన్యపు ముద్రగల వ్యక్తులు తమకు చెందినవారు కారు. మరొకరికి చెందినవారు. స్టిగ్మటా అనే ఈ గ్రీకు పదానికి ముద్ర లేక వాత అని అర్థం. కొన్ని పర్యాయాలు బానిసలకు, నేరస్తులకు ముఖంపై, శరీరంపై లేక చేతిపై వాతవేసేవారు.

2. **భక్తులు :** వీరి భక్తికి సమర్పణకు సూచనగా వీరిపై ముద్రలు వేయబడేవి. ఇవి అసత్యబోధకులకు ఉండవు. వారు తమ మట్టుకు తమ్మును మాత్రమే రక్షించుకొంటారు అంతే.

**3. నేరస్థులు :** నేరస్థులను అందరూ గుర్తించేందుకు వీలుగా వారికి ముద్రవేసేవారు.

**4. సైనికులు :** సైనికులకు వారి రాజభక్తికి గుర్తుగా ముద్రలు వేయబడేవి.

**5. ఇతరుల చేత అసహ్యించుకొనబడినవారు :** వీరిపై దూషణకు గుర్తుగా ముద్రలు వేయబడేవి.

పౌలు శరీరమందున్న ముద్రలు ఈ ఐదింటికి సంబంధించినవి. అసత్య బోధకులు యెరూషలేము నుండి అధికార పత్రాలు తీసికొని వచ్చారు. కాని పౌలుకైతే అతని శరీరంపై ఉన్న ముద్రలే అతని అపొస్తలత్వపు నియామకానికి, అధికారానికి చిహ్నంగా ఉన్నాయి.

కూలివాని చేతుల కరకుదనం, వాతావరణ తాకిడికి మొరటుగా మారిన నావికుని ముఖం, సైనికుని గాయపుమచ్చలు, మాతృమూర్తి నుదుటిపై ముడతలు వారికి ఘనతనిస్తాయి. క్రీస్తు సేవకుల ముద్రలు ఈలోకంలో ఘనతకు పరలోకంలో మహిమకు దోహదపడతాయి. క్రీస్తులో విశ్వాసికివ్వబడిన నూతన జీవితం అనంతమైంది. ఆయనలో మనకివ్వబడిన స్వాతంత్ర్యంలో అనంత జీవం ఉంది. ఆ నిజ స్వాతంత్ర్యాన్ని మీరు పొందారా? ఆ స్వాతంత్ర్యాన్ని ప్రభువు మహిమార్థం వినియోగిస్తున్నారా? పరీక్షించుకొందాం. ప్రభువు మిమ్మును దీవించునుగాక!

---

## ప్రేమధార పాఠకులకు ఒక విజ్ఞప్తి

భారత దేశములో గత 31 సంవత్సరములుగా రేడియో ద్వారా సువార్తను ప్రకటిస్తున్న ట్రాన్స్ వరల్డ్ రేడియో – ఇండియా (టి.డబ్ల్యు.ఆర్–ఇండియా) దర్శనం ప్రకారం రేడియో ద్వారా సువార్త ప్రకటించి, రక్షించబడిన వారిని సంఘాలలో బలపర్చాలని, సామాజిక వికాస పథకాల ద్వారా సమాజాన్ని రూపాంతరపర్చాలని ఆశిస్తున్నాం. అందుకు మీ ప్రార్థన, ఆర్థిక సహకారాలు ఎంతైన అవసరం. ఈ రేడియో కార్యక్రమాలను మీ బంధువులకు, స్నేహితులకు, ఇరుగు పొరుగు వారికి పరిచయం చేయండి. ఇక నుండి రేడియో పరిచర్య నిమిత్తం మీరు పంపించే విరాళాలు (చెక్కు/డిమాండ్ డ్రాఫ్ట్/మనియార్డర్) "ట్రాన్స్ వరల్డ్ రేడియో–ఇండియా" (Trans World Radio - India) పేరు మీద తీసి మా చిరునామాకు పంపించవలసినదిగా మనవి చేస్తున్నాము. ప్రభువు మీకిచ్చిన ధనాన్ని విలువైన దాని కొరకు పెట్టుబడిగా పెట్టి నిత్యత్వంలో అధిక లాభాన్ని పొందాలని ఆశిస్తున్నాం. ప్రభువు మిమ్మల్ని, మీ కుటుంబాన్ని సమృద్ధిగా దీవించునుగాక! ఆమేన్!!

---

**TTB - Telugu - Study Outlines - Book of Galatians**
Printed by : Premadhara, Trans World Radio - India, 12-1-334/17/3,
Lalapet, Secunderabad - 500 017. Ph : 040-27003011.

**FREE** MP3 DOWN LOAD - Log on to :
**www.radio882.com**